క్లుప్తంగా

కార్మికులకు వైద్య పరీక్షలు



ఊట్కూరు: మండలంలోని మగ్దుంపూర్‌లో కార్మికుల శాఖ ఆధ్వర్యంలో గుర్తింపు కార్డులు ఉన్న కార్మికులకు బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. సీఎస్‌సీ హాస్పిటల్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో 70 మందికి రక్త పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సీఎస్‌సీ జిల్లా కోఆర్డినేటర్ అబ్దుల్‌నయీం, కోఆర్డినేటర్ మహమ్మద్ ఆదీప్, సంఘం నాయకులు చెన్నప్ప, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ కమిటీ ఎన్నిక

నర్వ: మండలంలోని లంకాల్‌లో మత్స్యకార్మిక సంఘం నూతన గ్రామ కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తోకలి రాములు, ఉపాధ్యాక్షుడిగా లక్ష్మయ్య, కార్యదర్శిగా బండ రాముతో పాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఎన్నికల అధికారి సత్యనారాయణ వారికి నియామక పత్రాలు అందజేశారు.

బహిరంగసభకు తరలిరండి

నారాయణపేట టౌన్: జడ్చర్ల నియోజకవర్గంలో గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే పీపుల్స్ మార్చ్ బహిరంగసభకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలని అధ్యక్షుడు వాకిటి శ్రీహరి బుధవారం ప్రకటనలో తెలిపారు. సభ సాయంత్రం 4 గంటలకు ఉంటుందని పేర్కొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని వినతి

కోస్గి: పట్టణంలో తీవ్ర తాగునీటి ఎద్దడితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను పరిష్కరించాలని టీడీపీ పార్లమెంట్ అధికార ప్రతినిధి రాములు కమిషనర్ శశిధర్‌కు వినతిపత్రం అందజేశారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి శివాజీ నగర్ చౌరస్తా, పాత బస్టాండ్, బహార్‌పేట, ఆర్యసమాజ్, బృందావన్ కాలనీల్లో తాగునీటి సమస్య ఉందన్నారు. తాగునీరు రాకపోవడంతో ప్రైవేట్‌గా రూ.10 చెల్లించి ఒక బిందె నీరు కొనుగోలు చేస్తున్నారన్నారు.

నేడు యూనిట్ల పంపిణీ

నర్వ: మహిళా సంఘాలకు యూనిట్ల పంపిణీని గురువారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తునట్లు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని పాథర్చేడ్ గ్రామానికి నాలుగు యూనిట్లు మంజూరయ్యాయని తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి హాజరవుతారని వివరించారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో చెలరేగిన మంటలు



మరికల్: ఎండలు రికార్డు స్థాయిలో నమోదు కావడంతో బుధవారం మండల కేంద్రంలోని ఓ ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు చెలరేగాయి. నారాయణపేట రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు మంటలు అంటుకున్న విషయాన్ని గమనించిన బాటసారులు ట్రాన్స్‌కో సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వెంటనే వారు విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో ప్రమాదం తప్పింది. మంటలు అంటుకున్న ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో మరొకటి ఏర్పాటు చేసేందుకు సిబ్బంది చర్యలు చేపట్టారు.

15వ రోజుకు చేరిన దీక్ష

నారాయణపేట రూరల్: మండలంలోని కోటకొండలో నిర్వహిస్తున్న రిలేదీక్షలు 15వ రోజుకు చేరుకున్నాయి. బుధవారం ఊటకుంటతండా ప్రజలు కూర్చొని మాట్లాడారు. అన్ని అర్హతలు ఉన్న కోటకొండను విస్మరించడం రాజకీయ దురుద్దేశమేనని విమర్శించారు. ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు తాత్కాలికంగా భవనాలు ఉన్నాయని, కొత్త భవన నిర్మాణానికి అనువైన ప్రభుత్వ స్థలం ఉందని అన్నారు. చుట్టు పక్కల ఎన్నో గ్రామాలకు కేంద్ర బిందువుగా ఉందన్నారు. ప్రభుత్వం కోటకొండను మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చెన్నప్ప, వెంకట్రాములు, నర్సింహులు, భీమేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

తీలేర్‌లో పశుగ్రాసం దగ్ధం

మరికల్: మండలంలోని తీలేర్‌లో వ్యవసాయ పొలంలో ఉన్న పశుగ్రాసానికి బుధవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారని బాధితుడు రవి తెలిపారు. ఇటీవల వరికోతలు వేసిన 8 ఎకరాల పశుగ్రాసంను ఒకే దగ్గర గడ్డివాము వేసినట్లు తెలిపారు. ఈ విషయంపై పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. పశుగ్రాసంతో పాటు విలువైన కొబ్బరి, మామిడి, జమ్ముచెట్లు కూడా దగ్ధం కావడంతో రూ.2 లక్షల నష్టం వాటిల్లిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

శివారు కాలనీల్లో చెత్త డంపింగ్

- దుర్వాసనతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు
- చిన్నపాటి గల్లీల్లో రాని చెత్తవాహనాలు

నారాయణపేట టౌన్: పట్టణంలోని మురుగు కాల్వలో మట్టి, చెత్తాచెదారం తొలగించి పట్టణానికి జిల్లా కేంద్రంలో యాద్గిర్ రోడ్, ఎర్రగుట్ట, బైరంకొండ, లోయకపల్లి, పట్టణ గ్రామ శివారులో చెత్తను డంపింగ్ చేయడంతో అటుగా వెళ్లే ప్రయాణికులు దుర్వాసన వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు ట్రాక్టర్‌లో చెత్తసేకరణ చేసి పట్టణానికి సమీపంలోని యాద్గిర్‌రోడ్‌లోని సమీపంలో చెత్తాచెదారం, మరి కొందరు చెత్త పారవేసి నిప్పుపెట్టడంతో పొగ నుంచి ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది.



పట్టణ సమీపంలోని యాద్గిర్ రోడ్ పక్కన పారబోసిన చెత్త



శాతవాహన కాలనీలో రోడ్డు పక్కన వేసిన చెత్త

చెత్తకు నిప్పు పెట్టడం వల్ల కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నా అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పట్టణానికి సమీపంలోని పగిడిమర్రి రోడ్‌లో డంపింగ్ యార్డు ఉన్నప్పటికీ ఎక్కడపడితే అక్కడ పట్టణ శివారులో చెత్త డంపింగ్ చేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించిన పట్టణ శివారులో చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

దుర్వాసన వస్తుంది..

రోడ్డు పక్కన చెత్త వేయడంతో దుర్వాసన వస్తుంది. ప్రధాన రహదారిలో రోడ్డుకు ఇరువైపులా చెత్త వేయడంతో ముక్కు మూసుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

– శ్రీనివాసులు, నారాయణపేట

యార్డుకు తరలిస్తున్నాం..

చెత్త సేకరించి పట్టణంలో డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. పట్టణ శివారులో వేయకుండా పారిశుద్ధ్య కార్మికులకు అవగాహన కల్పించాం. మరోసారి అవగాహన కల్పిస్తాం. రోడ్డు పక్కన పారవేసిన చెత్త తొలగించేలా చర్యలు తీసుకుంటాం.

– సునీత, మున్సిపల్ కమిషనర్

అభివృద్ధి పథకాలే గెలిపిస్తాయి

నారాయణపేట రూరల్: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలే తిరిగి బీఆర్‌ఎస్‌కు పట్టం కడుతాయని ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 14వ వార్డుకు చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు బుధవారం గులాబీ కండువ కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ జరగని అభివృద్ధి గడిచిన 9ఏళ్లలో చేశామని, గిరిజనులకు ప్రత్యేక పంచాయతీలు ఏర్పాటు చేశామని, ప్రతి గ్రామానికి రోడ్లు, అంతర్గత రహదారులు, డ్రెయినేజీలు ఏర్పాటు చేశామన్నారు. విద్యాభివృద్ధికి ప్రత్యేక నిధులు, మన ఊరు– మన బడి పేరుతో సర్కారు పాఠశాలలకు మహర్దశ తెచ్చిపెడుతున్నామని చెప్పారు. తాగు, సాగునీటి కల నెరవేర్చడానికి పాలమూర్–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం చేపడుతున్నట్లు చెప్పారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక బీజేపీ, కాంగ్రెస్ తప్పుడు ప్రకటనలు చేస్తుందని దుయ్యబట్టారు. మున్సిపల్ చైర్మెన్ గందె అనసూయ, నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు టీకా..

పట్టణంలోని ఉర్దూ భవన్‌లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోలియో ఫీడింగ్, హజ్ యాత్రికులకు టీకాల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లా అభివృద్ధి, ఐక్యతకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. హజ్‌యాత్రికుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశారన్నారు. జిల్లా కోటలో 67మంది ఉండగా దరఖాస్తు చేసుకున్న 47మందికి అనుమతి లభించిందన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ రామనోహర్‌రావు, మున్సిపల్, మార్కెట్ చైర్మన్ గందెఅనసూయ, జ్యోతి, హజ్ యాత్ర సొసైటీ అధ్యక్షుడు అమిరోద్దీన్, ముజాహిద్‌సిద్ధిఖీ, అబ్దుల్ సలీం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

సివిల్స్ ర్యాంకర్‌కు అభినందనలు



హారతికి పెన్ను బహుమతిగా అందిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

నారాయణపేట రూరల్: సివిల్స్ ఫలితాల్లో ఆల్ ఇండియా 3వ ర్యాంకు సాధించిన ఎస్పీ ఎస్.వెంకటేశ్వర్లు కుమార్తె ఉమాహారతికి బుధవారం పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు అభినందనలు తెలపడానికి క్యూ కట్టారు. స్థానిక ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా డీఆర్‌డీఓ గోపాల్‌నాయక్, వ్యవసాయశాఖ జేడీ జాన్‌సుధాకర్, బీసీ వెల్ఫేర్ అధికారి కృష్ణమాచారి, సీపీఓ గోవింద్‌రాజ్, డీఎస్ఓ శివప్రసాద్‌రెడ్డి, డీఎఫ్ఓ వీణావాణి, డీఎస్‌డీఓ కన్యాకుమారిలు బొకె అందించి శాలువాతో సన్మానించారు. ఎస్పీ కార్యాలయంలోని ఐటీకోర్, వర్చువల్, ఎస్‌బీ, ఇంటిలిజెన్స్ తదితర విభాగాల సిబ్బంది కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. అడిషనల్ ఎస్పీ నాగేంద్రుడు మిఠాయి తినిపించారు. సీఐ రవిబాబుతో పాటు వివిధ పీఎస్‌లకు చెందిన ఎస్ఐలు పూలమొక్కలు అందించారు.

క్రీడాకారులకు బంగారు భవిష్యత్

మక్తల్: క్రీడాకారులకు బంగారు భవిష్యత్ ఉంటుందని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ సురేఖరెడ్డి అన్నారు. బుధవారం సీఎం కప్ లో భాగంగా నారాయణ పేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్, ఖోఖో పోటీలో మక్తల్ జట్లు విజేతలుగా నిలిచాయి. క్రీడాకారులకు ట్రోఫీతో పాటు ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో డీవైఎస్ఓ కృష్ణామాచారి, మున్సిపల్ చైర్ పర్సన్ గందే అనసూయ, ఎండీఓ శ్రీధర్, పీఈటీలు గోపాలం, రూప, రమేస్, జగదీస్, అంబ్రేస్ రిటైర్డు పీటీ గోపాలం పాల్గొన్నారు.



బహుమతులను అందజేస్తున్న జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ సురేఖరెడ్డి

క్రికెట్ టోర్నీ ప్రారంభం



క్రీడలను ప్రారంభిస్తున్న కుంభం శివకుమార్‌రెడ్డి

దామరగిద్ద: మండలంలోని బాపన్‌పల్లిలో దామరగిద్ద మండల ప్రీమియర్ లీగ్ టోర్నీని బుధవారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కుంభం శివకుమార్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో బాల్‌రెడ్డి, శ్రీనివాస్, శరణనాయక్, మహ్మద్ ఖాజా, ఆనంద్, లక్ష్మణ్, జలీల్, అంజి, ఉదయ్ పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ప్రారంభం



హోమంలో పాల్గొన్న దంపతులు

ఊట్కూరు: మండల కేంద్రమైన ఊట్కూరులోని భవానీ మందిరంలో బుధవారం నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం గణపతి హోమం, యాగశాల, యాగశాల ప్రవేశం, విగ్రహాల జలాధివాసం తదితర కార్యక్రమాలు చేపట్టారు. భవానీ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. గురువారం ఉదయం నవగ్రహాలు, సింహం, తాబేలు తదితర విగ్రహాల ప్రతిష్ఠాపన నిర్వహిస్తునట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు చౌదరి అశోక్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌కే సమాజ్ సభ్యులు చందులాల్, చంద్రు ప్రకాశ్, తుల్జారాం, జగన్నాథరావు, కేశవరావు, తదితరులు పాల్గొన్నారు.

పాత వస్తువుల నిల్వతో నష్టాలు

ఆత్మకూర్: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు తమ వద్దనున్న పాతవస్తువులు, పాత దుస్తులు, పాదరక్షలు, బుక్కులు, న్యూస్‌పేపర్లు అప్పగించాలని చైర్‌పర్సన్ గాయత్రి, వైస్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ నాగరాజు, కౌన్సిలర్లు అన్నారు. బుధవారం ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆర్‌ఆర్‌ఆర్ కార్యక్రమంలో భాగంగా 10 వార్డుల్లో శిబిరాలను ఏర్పాటు చేసి పాత వస్తువులను సేకరించారు. పాత వస్తువులు ఇళ్లలో నిల్వ ఉండడటం కారణంగా నష్టామే అన్నారు. పాతసామాన్లు అప్పగించిన వారికి ప్రశంసాపత్రాలను అందజేస్తామని పట్టణ అభివృద్ధికి, పరిశుభ్రతకు సహకరించాలని కోరారు.

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్లను బుధవారం మున్సిపల్ మేనేజర్ గణేష్‌బాబు పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణ కేంద్రంలోని ఏర్పాటు చేసిన ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్లలో పాత వస్తువులను అప్పించాలని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఈఈ యోగేష్‌కుమార్, రాజు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువులతో భూములు సారవంతం

కోస్గి: పచ్చిరొట్ట ఎరువులతో భూములు సారవంతం అవుతాయని ఎంపీపీ మధుకర్ రావు అన్నారు. బుధవారం గుండుమాల్ మండల కేంద్రంలోని ఆగ్రోస్ కేంద్రంలో ప్రభుత్వం రైతులకు రాయితీపై అందజేసిన జీలుగ పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రైతు సంక్షేమానికి రైతుబంధు, రైతుబీమా పథకాలు అమలు చేస్తున్న ఘటన సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. రాయితీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ప్రకాష్‌రెడ్డి, ఏఓ శరత్ చంద్రా, ఏఈఓలు చందన, తిరుపతి, నరేందర్, నాయకులు జాజం వెంకటేష్, రవీందర్‌రెడ్డి, అంజయ్య గౌడ్, ఆగ్రోస్ నిర్వాహకులు ఆనంద్ పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించి ఆరోగ్యంగా ఉండండి

ఆత్మకూర్: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు పరిసరాల పరిశుభ్రతను పాటించి అందరూ ఆరోగ్యంగా ఉండాలని చైర్‌పర్సన్ గాయత్రి, వైస్ చైర్మన్ విజయ భాస్కర్‌రెడ్డి, కమిషనర్ నాగరాజు, కౌన్సిలర్లు అన్నారు. బుధవారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా 10 వార్డుల్లో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపట్టారు. చెత్తను బయట పారబోయకుండా చెత్త డబ్బాల్లోవేసి చెత్తబండి వచ్చిన అనంతరం అప్పగించాలని సూచించారు.

ఆర్పీలకు చీరల పంపిణీ..

మెప్మా పరిధిలోని మహిళా సంఘాల రీసోర్స్‌పర్సన్‌లకు డ్రెస్‌కోడ్ నిమిత్తం చీరలను మున్సిపాలిటీ కార్యాలయంలో చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవియాదవ్, కౌన్సిలర్ మండ్ల రామకృష్ణ పంపిణీ చేశారు. ఆర్పీలు రేణుక, మాధవి, స్వప్న, పల్లవి, శ్రావణి, సిబ్బంది ఉన్నారు.

మహిళా సమాఖ్య భవనంలో సమస్యల తిష్ట

అమరచింత: మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో సమస్యలు తిష్ట వేసిన అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు తెలిపారు. మండల మహిళా సమాఖ్య భవనాన్ని బుధవారం సీపీఐ బృందం పరిశీలించింది. జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ.. భవనం రంగు వెలిసిపోయిందన్నారు. మరుగుదొడ్లు లేవని, తాగునీటి వసతి లేదని, ఫ్లోరింగ్ దెబ్బతిన్నట్లు తెలిపారు. ప్రభుత్వం జూన్ 2 నుంచి రాష్ట్ర ఆవిర్భావ ఉత్సవాలకు మహిళలు వస్తారని ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం తగదు

ఆత్మకూర్: జాతీయ ఉపాధి హామీ పనుల్లో నిర్లక్ష్యం తగదని, లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యాదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశమయ్యారు. వేసవి నేపథ్యంలో ఉపాధి కూలీలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రానున్న హరితహారంలో భాగంగా లక్ష్యానికి మించి మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ విజయభాస్కర్‌రెడ్డి, టెక్నికల్‌అసిస్టెంట్ రఘు, కార్యాదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

పిచ్చిమొక్కలు తొలగించండి

నారాయణపేట టౌన్: పట్టణంలోని సాయివిజయ్ కాలనీలో డ్రెయినేజీ నిర్మాణం చేపట్టారు. అయితే దానికి ఇరువైపులా పిచ్చి మొక్కలు, ముళ్లపొదలు పెరిగిపోవడంతో డ్రెయినేజీ శుభ్రం చేసేందుకు ఇబ్బందులు పడుతున్నామని మున్సిపల్ కార్మికులు వాపోయారు. ముళ్లపొదలు ఉండటంతో రాత్రి వేళ విష పురుగులు, పాములు సంచారిస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నెలలు గడుస్తున్నప్పటికీ పరిశుభ్రం చేపట్టకపోవడంతో చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు నిండిపోయి మురుగు పారడం లేదని, దుర్వాసన వస్తుందని వాపోతున్నారు. మున్సిపల్ అధికారులు దృష్టిసారించి పిచ్చి మొక్కలు తొలగించి, డ్రెయినేజీలు పరిశుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.



సాయి విజయ్ కాలనీలో డ్రెయినేజీకి ఇరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలు

అంధత్వ నివారణే ప్రభుత్వ లక్ష్యం

కృష్ణా: అంధత్వ నివారణే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీఓ శ్రీనివాసులు, సర్పంచ్ దేవేంద్రప్ప అన్నారు. బుధవారం మండలంలోని మురహర్‌దొడ్డిలో కంటి వెలుగు శిబిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. కంటి పరీక్షలు పూర్తిగా ఉచితంగా నిర్వహిస్తారని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అవసరమయ్యే కళ్ల అద్దాలతో పాటు శస్త్ర చికిత్సలు చేస్తారన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ తిమ్మప్ప, వైద్యాధికారిణి రాణి తేజశ్వని, సిబ్బంది మల్లేష్, నరేష్, ఏఎన్‌ఎంలు రజిని, ఫర్వీన్‌బేగం, ఆశ వర్కర్లు నందిని, పద్మ, యువకులు పాల్గొన్నారు.



కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

ప్రమాదాలకు అడ్డాగా..

- వర్కూర్ క్రాస్ రోడ్డు, బస్టాండ్ చౌరస్తా
- ప్రాణాలు కోల్పోతున్నా స్పందించని అధికారులు



ప్రమాదకరంగా ఉన్న బస్టాండ్ చౌరస్తా

మాగనూర్: మండల కేంద్రంలోని వర్కూర్ క్రాస్ రోడ్డు, బస్టాండ్ చౌరస్తా ప్రమాదాలకు నిలయంగా మారింది. ఆ ప్రాంతాల పేరు చెబితేనే ప్రయాణికులు, వాహనదారులు హడలిపోతున్నారు. మాగనూర్ పోలీస్‌స్టేషన్‌కు అతి సమీపంలో ఉన్న వర్కూర్ క్రాస్ రోడ్డు నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ ప్రమాదంలో పలువురు మృత్యువాత పడటంతో పాటు గాయాల పాలవడం పరిపాటిగా మారింది. హైదరాబాద్, రాయచూర్, గోవా తదితర ప్రాంతాలకు వెళ్లాలంటే ఈ రహదారి గుండా వెళ్లాల్సిందే. డేంజర్ స్పాట్‌ల వద్ద కనీసం హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. గతంలో ఇక్కడ ప్రమాదాలు జరిగి అనేక మంది వికలాంగులుగా మారాయి. కొన్ని నెలల కిందట బస్టాండ్ చౌరస్తాలో రోడ్డు దాటుతున్న వృద్ధుడిని డీసీఎం ఢీకొన్న ఘటనలో అక్కడికక్కడే మృతి చెందాడు. అదే విధంగా నాలుగు రోజుల కిందట మరో యువకుడు లారీ ప్రమాదంలో మృతి చెందాడు. ఇటీవల ఒక కారు ద్విచక్రవాహనదారుడిని ఢీకొన్న సంఘటనలో ద్విచక్ర వాహనదారుడికి కాళ్లు విరిగాయి. తాజాగా బస్టాండ్ చౌరస్తాలో ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొని ఇద్దరు యువకులకు తీవ్రగాయాలయ్యాయి.



ప్రమాదాలు నివారించాలని గ్రామస్తుల రాస్తారోకో(ఫైల్)

ప్రమాదానికి కారణాలివే..

వర్కూర్ క్రాస్ రోడ్డు వద్ద హైదరాబాద్ నుంచి రాయచూర్ వైపునకు వెళ్లే వాహనాలు అతి దగ్గరకు వచ్చే వరకు కనిపించవు. అకస్మాత్తుగా కనిపించిన వాహనాలను తప్పించేలోపే ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. హెచ్చరిక బోర్డులు సరిగ్గా లేకపోవడంతో కూడా ప్రమాదాలకు మరో కారణం అని చెప్పవచ్చు. గత నెల రోజులలో అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్ల, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయించి ప్రమాదాలకు చెక్ పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

స్పీడ్ బ్రేకర్లు అవసరం..



మాగనూర్ బస్టాండ్ చౌరస్తా, వర్కూర్ క్రాస్ రోడ్డు దగ్గర నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ సర్కిల్‌ల వద్ద ఇరువైపులా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. ఇక్కడ స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి. అధికారులు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి.

– ఆనంద్‌గౌడ్, మాగనూర్ .

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి..



మండల కేంద్రంలో ఎన్‌హెచ్–167పై డివైడర్‌ల దగ్గర నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రమాదాల నివారణకు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. ఇప్పటికే అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా చూడాలి.

– పల్లె మారెప్ప, గ్రామస్తుడు.

నేషనల్ అథారిటీకి తెలిపాం..



మాగనూర్ మండలంలోని 9 ప్రధాన ప్రమాద ప్రదేశాలను గుర్తించాం. సంబంధిత నేషనల్ హైవే అథారిటీ వారికి స్పీడ్ బ్రేకర్లు, జీగ్‌జాగ్‌లు ఏర్పాటుపై వివరించాం. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం.

– నరేందర్, ఎస్ఐ, మాగనూర్

రైస్‌మిల్లుకు ధాన్యం నిలిపివేత

మహమ్మదాబాద్: వరిధాన్యం సేకరణలో మోసాలకు పాల్పడుతున్నారని మహమ్మదాబాద్‌కు చెందిన లక్ష్మీబాలాజీ రైస్‌మిల్లుకు వరిధాన్యం నిలిపివేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఆదిత్యగౌడ్ ఆధ్వర్యంలో రైస్‌మిల్లుకు ధాన్యం వెళ్లకుండా నిలిపివేశారు. అక్కడికి వెళ్లిన సుమారు 40 లారీల వరకు ధాన్యం ఇతర రైస్ మిల్లులకు తరలించినట్టు తెలిపారు. కాగా మిల్లులో యాజమాన్యం అధిక మోసాలకు పాల్పడుతూ బస్తాకు రెండు కిలోలు తరుగు తీస్తున్నారన్న రైతుల ఫిర్యాదు మేరకు కలెక్టర్, ఉన్నతాధికారుల ఆదేశాలతో చర్యలు తీసుకున్నామని వివరించారు. కాగా సదరు రైస్‌మిల్లు ఇప్పటికే దాదాపు రెండు లక్షల బస్తాలకు పైగా ధాన్యాన్ని సేకరించింది. దీంతో రైతులు లక్షల్లో నష్టపోయారు. ప్రస్తుతం ప్రభుత్వం ఉన్నతాధికారులు తీసుకున్న నిర్ణయం మేరకు ఇప్పటికైనా తరుగు తీయడం నిలిపివేస్తారా? గతంలో తీసుకున్న తరుగును మిల్లర్ల నుంచి రైతులకు చెల్లిస్తారా ? అన్నది ప్రశ్నార్థకంగా మారింది.